కాంగ్రెస్ మోసాలపై మండల కేంద్రాల్లో ధర్నాలు

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

లింగాలఘనపురం, జనవరి 19 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వీటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందున పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఉదయం 10 గనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రైతులతో దీక్షలు, ధర్నాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో మహాధర్నా చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఇందులో సగం మందికే అమలు చేసిందన్నారు. రైతుభరోసాలో ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూమిలేని వారికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి నేడు అనేక ఆంక్షలు విధిస్తున్నారని రాజయ్య వివరించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న వేలేరు, 21న చిల్పూరు, 22న లింగాలఘనపురం, 23న రఘునాథపల్లి, 24న జఫర్‌గఢ్, 25న ధర్మసాగర్, 26న స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రైతు నిరసన దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు ఆయా మండలాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాజయ్య పిలుపునిచ్చారు.

తుకారాం కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నర్మెట, జనవరి 19: మండలంలోని హన్మంతాపూర్‌కు చెందిన లకావత్ తుకారాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో తుకారాంతో పదో తరగతి చదువుకున్న 1993-94 బ్యాచ్ మిత్రులు ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. తమవంతుగా రూ.18 వేలు ఆర్థిక సాయం అందించారు. తుకారాం కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడికందుల నరహరి, పండుగ రమేశ్, పన్నీరు శ్రీనివాస్, పగడాల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న చెన్నూరులో క్రీడాకారుల ఎంపిక పోటీలు

రఘునాథపల్లి, జనవరి 19: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కోసం ఈ నెల 21న పాలకుర్తి మండలం చెన్నూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, కోశాధికారి ఏదునూరి ఉప్పలయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 21న ఉదయం 11 గంటలకు చెన్నూరులోని పాఠశాల ఆవరణలో క్రీడలు ప్రారంభమవుతాయని తెలిపారు. క్రీడాకారులకు వయస్సుతో పనిలేదని, బరువు 85 కిలోల లోపు ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు అదిలాబాద్‌లో జరిగే 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరితో రెడ్డి సంఘం సభ్యులు

రెడ్డి కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు

చిల్పూరు, జనవరి 19 : రెడ్డి సంఘం కమ్యూనిటీ హాలుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య హామీ ఇచ్చారని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి అన్నారు. రెడ్డి సంఘం సభ్యులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వారి నివాసంలో ఆదివారం కలిశారు. చిన్నపెండ్యాలలో రెడ్డి సంఘం కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు ఎంపీ నిధులను కేటాయించాలని కోరినట్లు ఆయన తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవరెడ్డి, రాంరెడ్డి, దోమ రవీందర్ రెడ్డి, నోముల మల్లారెడ్డి, గంపుల రవీందర్ రెడ్డి, ఎలుగేటి వెంకట్‌రెడ్డి, నోముల ప్రసాద్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ 60 రకాల వెజ్ & నాన్‌వెజ్ పచ్చళ్ళు కిరాణా షాపులకు, కర్రీపాయింట్లకు, బేకరీషాపులకు, హోటల్స్‌లకు సప్లై చేయడానికి బైక్ కలిగిన యువకులు మండలానికి ఒకరు కావలెను. సెల్ : 8143909459

KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, జనవరి 19 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన గోనెగాళ్ల మాతమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్ గౌడ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. మాతమ్మ ఆనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందిన నేపథ్యంలో ఆదివారం బాధితురాలని ఆయన పరామర్శించారు. పేదలకు తనవంతు సాయం అందిస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెవిటి సోమయ్య, తాటికొండ నర్సింహచారి, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో వర్క్‌షాప్

హనుమకొండ చౌరస్తా, జనవరి 19 : నిట్ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్, రాష్ట్రీయ ఆవిష్కార్ అభయాన్, స్కోప్ ప్రాజెక్టు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిట్‌లో ఆదివారం సైన్స్ కమ్యూనికేషన్‌పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆచార్య ఆంజనేయులు సంధానకర్తగా వ్యవహరించిన కార్యశాలలో ప్రధానవక్తగా హాజరైన నిట్ ప్రొఫెసర్ రామరాజు జీవపరిణామ సిద్ధాంతం, సెన్స్ బయో మెటీరియల్స్ జనరేషన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ రాములు జీవ పరిణామ సిద్ధాంతాన్ని రుజువులతో తెలియజేశారు. ఎన్విరాన్‌మెంటల్ సబ్ కమిటీ కన్వీనర్ కేబీ ధర్మప్రకాశ్ 'గో గ్రీన్ బ్రీతింగ్ టు మారో' అనే అంశంపై ప్రత్యేకంగా వివరించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

అంబేద్కర్ కృషితోనే నిరుపేదలకు రిజర్వేషన్లు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, జనవరి 19 : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ కృషితోనే అట్టడుగువర్గాలకు ప్రత్యేక హక్కులతోపాటు రిజర్వేషన్లు లభించాయని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ 14వ వార్డులో స్థానిక కౌన్సిలర్ పేర్ని స్వరూప రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, విగ్రహ దాత, వర్ధమాన సినీ నటి దూసరి ధనలక్ష్మి (ఐశ్వర్య), దళిత నేత డాక్టర్ పీ సుగుణాకర్ రాజు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగంలో సమాన హక్కులతో పాటు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప మేధావి అంబేద్కర్ అని తెలిపారు. అట్టడుగు వర్గానికి చెందిన అంబేద్కర్‌కు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఎనలేని కీర్తిని జీర్ణించుకోలేని కొందరు నాయకులు మహనీయుడి పేరును అవమానించేలా ప్రవర్తిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు అన్ని రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, కౌన్సిలర్లు తాళ్ల సురేశ్‌రెడ్డి, బొట్ల శ్రీనివాస్, ముస్త్యాల దయాకర్, బండ పద్మ, జూకంటి లక్ష్మి, కమలమ్మ, బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, నాయకులు ఉడుగుల కిష్టయ్య, జూకంటి శ్రీశైలం, సేవెల్లి మధుసూదన్, ఉడుగుల నర్సింహులు, తిప్పారపు విజయ్, సతీశ్, పానుగంటి ప్రవీణ్, తాళ్లపల్లి సురేశ్, సాగర్, మేకల శంకరయ్య, డాక్టర్ ప్రభాకర్, కరాటే సలీం, గుండెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

తరిగొప్పుల : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తరిగొప్పుల, నర్మెట మండలాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాడని ఆయన విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్ది రాజి రెడ్డి, గద్దల నర్సింగరావు, తరిగొప్పుల మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి, అధికార(ప్రతినిధి చిలివేరు లింగం, గ్రామ అధ్యక్షుడు అంకం రాజారాం, నాయకులు జొన్నగోని సుదర్శన్‌గౌడ్, ముద్దసాని వెంకట్‌రెడ్డి, అర్జుల సంపత్ రెడ్డి, బీరెడ్డి జార్జిరెడ్డి, దామెర ప్రభుదాస్, చెన్నూరి సంజీవ, భూక్యా జాంలాల్ నాయక్, తాళ్లపల్లి రాజేశ్వర్ గౌడ్, అంకం శ్రీనివాస్, ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నూకల కృష్ణమూర్తి, ముక్కెర బుచ్చిరాజ్ యాదవ్, పోగుల అశోక్, భూస యాదయ్య, నేతుల సత్తయ్య, తాళ్లపల్లి పోష య్య, భూక్యా రవి, సాయిల్ల రాజు, వంగ బీమ య్య, సుంకరి రాజయ్య, ఇరుమల్ల రాజయ్య, బెల్లం రాజు, తుపాకుల సత్తయ్య, యూత్ అధ్యక్షుడు మాల్యాల సుధీర్, ఖాతా టోని పాల్గొన్నారు.

వెంకటేశ్ కుటుంబానికి అండగా బీఆర్ఎస్ : పల్లా

జనగామ రూరల్, జనవరి19 : తెలంగాణ ఉద్యమంలో నాయకుడిగానే బీఆర్ఎస్‌లో చురుగ్గా పనిచేసిన మచ్చ వెంకటేశ్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్ ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పల్లా ఆదివారం పరామర్శించారు. వెంకటేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండ్లపల్లి రవి ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పల్లా

ఎల్‌వోసీని అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

దేవరుప్పుల, జనవరి 19 : మండల కేంద్రానికి చెందిన ఏషబోయిన అనూష అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్‌లో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్‌వోసీని బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆదివారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిగిల్ల వెంకన్న అనిల్, సాత్విక్ పాల్గొన్నారు

31న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మహాధర్నా

రాష్ట్ర కార్యదర్శి కొమురయ్య

రఘునాథపల్లిలో మాట్లాడుతున్న కొమురయ్య

రఘునాథపల్లి జనవరి 19: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న హైదరాబాద్‌లోని అంజయ్య భవన్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కొట్టె ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కొమురయ్య కోరారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు అందించి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో సుమారు నాలుగు వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కొమురయ్య తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 31న జరిగే మహాధర్నాకు భవన నిర్మాణ కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య, కార్యదర్శి పసుల ఏలియా, ఉపాధ్యక్షులు బొమ్మర్ల యాకయ్య, తాడూరి సత్యం, గొల్లూరి సరేశ్, నాయకులు చెరుకు రాజు, సింగపురం భిక్షపతి, తోకల రాజ్‌కుమార్, మైసయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఉప్పుగల్లులో మాట్లాడుతున్న కుర్ర ఉప్పలయ్య

జఫర్‌గఢ్, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పుగల్లులో ఆదివారం ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని గీత కార్మికులకు ఆయన పిలునిచ్చారు. ప్రమాదాలను నివారించేందుకు కాటమయ్య రక్షణ కిట్‌ను ప్రభుత్వం పరిమితంగా ఇస్తున్నదన్నారు. దీనిని అర్హులందరికీ అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరుకొప్పుల రాజు, బాల్నె వెంకట మల్లయ్య, నాయిని యాదగిరి, మండలాధ్యక్షుడు గడ్డం రాజు, ఉపాధ్యక్షుడు పులి ధనుంజయ్, మూల సారయ్య, బొల్లపల్లి రాజు, మధుకర్, యాకయ్య, రమేశ్, రాజు, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

లింగాలఘనపురం, జనవరి 19 : జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్(నరసింహులు) తండ్రి కృష్ణమూర్తి(78) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, నాయకులు గండి యాదగిరి, బోయిని రాజు, దూసరి సోమనర్సయ్య, కూకట్ల మల్లయ్య, కారంపురి చంద్రయ్య, బూడిద రాజేశ్వర్‌గౌడ్, గండి శ్రీనివాస్, బుషిగంపల అంజనేయులు, గవ్వల మల్లేశం ఉన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలు

- కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా
- లబ్ధిదారుల ఎంపికపై గ్రామాల్లో అధికారులతో సర్వే

గోపాల్‌నగర్, నర్మెటలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

ఉప్పుగల్లులో మాట్లాడుతున్న అధికారులు

బచ్చన్నపేట, జనవరి 19 : అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ఇందులో అనుమానాలకు తావులేదన్నారు. ఆదివారం బచ్చన్నపేట మండల కేంద్రంతో పాటు గోపాల్‌నగర్‌లో అధికారులు నిర్వహించే సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా షేక్‌రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. జాబితాలో పేర్లు లేని వాటికి కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు రేషన్‌కార్డుల కోసం గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రజలకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, పేదలకు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. రైతుభరోసాలో ఈ నెల 26 నుంచి రైతులకు సాయం అందిస్తామని, వ్యవసాయ యోగ్యం లేని భూములకు పథకం వర్తించదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందించేందుకు సర్వే చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు మోకు కవిత, వెంకటాచారి, ఆర్ఐ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట : సంక్షేమ పథకాల అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ షేక్‌రిజ్వాన్ పాషా ఆదేశించారు. ఆదివారం నర్మెటలో చేపట్టిన క్షేత్ర స్థాయి సర్వేను ఆయన పరిశీలించారు. అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రామానుజచారి, ఎంపీడీవో అరవింద్, డీటీ వేణు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల : మండలంలోని సోలిపురంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో మాలతి సర్వేను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా సర్వే నిర్వహించాలని ఉద్యోగులను కోరారు. పంచాయితీ కార్యదర్శి లింగం, సిబ్బంది రామచంద్రం, వెంకటమ్మ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులకు సూ చించారు. ఆదివారం మండలంలోని శివునిపల్లిలో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. రేషన్ కార్డులో పేర్లు నమోదుకు 110 దరఖాస్తులు రాగా, వీటిలో 97 దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో కలిసి వివరాలు సేకరించామని అధికారులు తెలుపడంతో ఆయన వారిని అభినందించారు. రైతు భరోసా సర్వే ఎంత వరకు చేశారు, వ్యవసాయానికి యోగ్యం కాని భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయని రోహిత్‌సింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు కోసం అర్హులు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో స్వరూపారాణి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, మండల వ్యవసాయాధికారి చంద్రన్‌కుమార్, ఎంపీవో నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏఈవో ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న రోహిత్ సింగ్

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టిన సర్వే మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కొనసాగింది. ఉప్పుగల్లులో రేషన్‌కార్డు, రైతు భరోసా సర్వేను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ పరిశీలించారు. ఒబులాపూర్, షాపల్లి, లక్ష్మీనాయక్ తండా, హిమ్మత్ నగర్ గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో ఎంపీడీవో సుమన్, తహసీల్దార్ శంకరయ్య, ఏవో కర్ణాకర్‌రెడ్డి, ఆర్ఐ అనిల్‌బాబు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులిస్తున్న నిర్వాహకులు

క్రికెట్ పోటీల్లో విజేత కంచనపల్లి జట్టు

దేవరుప్పుల, జనవరి 19: సంక్రాంతి సంబురాలను పుస్కరించుకుని మండలం లోని మాధాపురంలో రెండు మండలాల స్థాయిలో యువజన సంఘం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందించారు. రఘునాధపల్లి మండలం కంచనపల్లి క్రికెట్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. క్రీడల నిర్వాహకులు వర్రె భాగ్య-సతీశ్ దంపతులు నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందించారు. రన్నరప్‌గా నిలిచిన మాధాపురం జుట్టుకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మడికొండ ఎల్లయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గోపా మండల అధ్యక్షుడిగా గట్టు మనోహర్

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 19 : గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) మండల కమిటీని ఎన్నుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సంఘం జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా డివిజన్ కేంద్రానికి చెందిన గట్టు మనోహర్‌గౌడ్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా గద్దె. అనిల్, కోశాధికారిగా గట్టు. ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, బూర నరేందర్, దొమ్మాటి వినోద్, కార్యదర్శులుగా వంగ.సదానందం, వీరగోని. పరుశురాములు, మోడేం అరుణ్‌కుమార్, బూరుగు. రంజిత్, కార్యవర్గ సభ్యులుగా గట్టు నవీన్‌కుమార్, మాచర్ల కుమారస్వామి, చిర్ర. పూర్ణచందర్‌ను నియమించినట్లు ఆంజనేయులుగౌడ్ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు..

అంతిమయాత్రలో గంగమ్మ

లింగాలఘనపురం, జనవరి 19 : మండల కేంద్రానికి చెందిన ఇటుకల వెంకటయ్య(80) అనారోగ్యంతో శనివారం మృతి చెందడంతో కూతురు దహన సంస్కారాలు నిర్వహించింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటుకల వెంకటయ్యకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. స్థానికంగా చిన్న హోటల్ నిర్వహించేవాడు. ఇతడికి భార్య వెంకటమ్మతో పాటు కూతురు గంగమ్మ ఉన్నారు. రెండేళ్లుగా అనారోగ్యంతో ఉంటున